ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 14 ఆగస్టు 2025

ఖని డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక సదస్సు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలంగా భాగస్వాములం అవుతామని, డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో మేము సైతమంటూ గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుదవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జైకిషన్ ఓజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో సాంబశివరావు, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

మిడ్‌మానేరుకు గోదావరి జలాలు

- ఎగువన వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద
- నంది పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలు ఆరంభం
- మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల తరలింపు
- వచ్చిన నీరు వచ్చినట్లే ఎత్తిపోయాలని నిర్ణయం



మేడారం పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తి పోస్తున్న మోటార్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉత్తర తెలంగాణలో గల పలు ప్రాజెక్టులకు గుండెకాయ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు ఆరంభం అయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఆయా జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో ముందుచూపుతో నీటి పారుదల శాఖాధికారులు అదనపు నీటిని గోదావరిలోకి వదిలే పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానే రులోకి నీటిని ఎత్తి పోస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు ఎల్లంపల్లిలోకి 16,027 క్యూసె క్కుల వరద నీరు రాగా, సాయంత్రం వరకు 19,062 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, 14.069 టీఎంసీలకు చేరుకున్నది. ఇంకా వరద కొనసా గుతుండడంతో పాటు రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటిస్తుండడంతో నీటి పారుదల శాఖాధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోయడం ఆరంభించారు. సాధారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు లోకి 17 టీఎంసీల నీళ్లు చేరినప్పుడు వరద ప్రవా హం పెరిగితే అవసరాన్ని బట్టి మిడ్ మానేరుకు తరలించడం గానీ, ఆ అవసరం లేకుంటే గేట్లు ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతుంటారు. ఈ ఏడాది ఆశాజనకంగా ఉత్తర తెలం

(మిగతా 8వ పేజీలో)

కడెం నుంచి ఎల్లంపల్లికి వరద

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రధాన ఆ ధారం నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు. ఈ ఏడాది దీని ఎగువ కూడా భారీ వర్షాలు నమోదు కాలేదు. మంగళ వారం రాత్రి కురిసిన వర్షానికి 30 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 4.669 టీఎం సీలు కాగా, ప్రస్తుతం 3.779 టీఎంసీల నీళ్ల ఉ న్నాయి. 3 గేట్ల ద్వారా గోదావరి లోకి 17,739 క్యూ సెక్కుల నీటిని వదిలి పెడుతు న్నారు. అయితే ఎల్లంపల్లిలోకి సాయంత్రం వరకు 19,062 క్యూసె క్కుల వరద నీరు వస్తున్నది. దీంతో ఉదయం నుంచే అధికారులు మిడ్ మానేరుకు ఎత్తిపో తలను షురూ చేశారు. ఉదయం రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని వదిలి పెట్టగా, సాయంత్రం వరకు మరొక మోటారును ఆన్ చేశారు. మొత్తం 9,4 50 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలి స్తున్నారు. ప్రస్తుతం మిడ్ మానేరులో 27..550 టీఎంసీలకు 7.60 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎస్సారెస్పీ నిండే వరకు శ్రీపాద ఎల్లంపల్లికి వచ్చిన వరద నీటిని వచ్చినట్లే ఎత్తి పోయాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఎల్ఎండీ ఎగువ ప్రాంతంలోని ఆయకట్టుకే సాగు నీటిని విడుదల చేస్తుండగా, ఎల్ఎండీ దిగువకు సాగు నీటిని విడుదల చేసే విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది.

ఎల్ఎండీ నీటి మట్టం 24.034 టీఎంసీలకు 6.875 టీఎంసీల నీళ్లు ఉన్నా యి. మోయ తుమ్మెద వాగు ద్వారా 2,485 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. మరిన్ని భారీ వర్షాలు పడి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లిలోకి భారీగా వరద నీరు వస్తే మాత్రం మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీకి, మల్లన్నసాగర్‌కు కూడా తరలించే అవకాశాలున్నాయి.

ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయా మండల కేంద్రాల్లోని ప్రీప్రైమరీ సెంటర్‌లలో ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. అర్హులైనవారు ఈ నెల 21లోగా తమ దరఖాస్తులను ఆయా స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లకు అందించాలని తెలిపారు. ప్రీ ప్రైమరీ పోస్టుకు ఇంటర్మీడియట్ అర్హత, ఆయాకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. అభ్యర్థులు 18నుంచి 44 ఏళ్ల వయసు కలిగి ఉండాల న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ వారికి 5 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు, మాజీ సైనికులకు మూడేళ్ల సడలింపు ఉంటుందన్నారు.

పాత పింఛన్ హామీ విస్మరిస్తే పోరాటమే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పెద్దపల్లికల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం ఆపేది లేదని పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు గండు క్రిష్ణమూర్తి అన్నారు. తాము 35, 40ఏళ్లుగా సేవచేసి పదవీ విరమణ పొందితే సీపీఎస్ ఉద్యోగిగా ఆసరా పెన్షన్‌కంటే తక్కువ పెన్షన్ పొందుతున్నాడని అన్నారు. సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ అమలు చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టి అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలిపిన ప్రస్తుతం ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. తమ ఆత్మాభిమానం దెబ్బతీస్తే సహించేది లేదన్నారు. అనంతరం పీఆర్‌టీయూ రాష్ట్రశాఖ రూపొందించిన సీపీఎస్ వ్యతిరేక మహాధర్నా పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని పాత మండల రిసోర్స్ సెంటర్ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెతుకు తిరుపతి, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, ఆగస్టు 13: (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు వంకల వద్ద జాగ్రత్తగా ఉంటూ వాటిని దాటడానికి ప్రయత్నించవద్దని సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాలైన నీరుకుళ్ల, గట్టెపల్లి, కదంబాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. మానేరు నీటి ఉధృతిని సీఐ పరిశీలించారు. నీరుకుళ్ల చెక్ డ్యామ్ వద్ద నీరు నిండుగా ఉన్నందున స్నానాలు చేసే వారు జాగ్రత్త లు పాటించాలని, దేవాలయం సమీపంలోని అనుమతించిన స్థలం వద్దనే స్నానాలు చేయాలని సూచిం చారు. డ్యామ్ వద్ద ఫొటోలు దిగే ప్రయత్నం చేయవద్దని తెలిపారు.

భారీ వర్షాల దృష్ట్యా హై అలర్ట్

● సీపీ అంబర్ కిషోర్ ఝా

కోల్‌సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రానున్న 72గంటల పాటు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిందని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాలజోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లవద్దన్నారు. ఎక్కడైనా రోడ్లపై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామప్రజలు వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవ హిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయవద్దన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- ప్రాథమిక విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించాలి
- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్బంగా మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పాఠశాలలోని 4వ తరగతి పిల్లల ఇంగ్లీష్ రీడింగ్ స్కిల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యా ప్రమాణాల పెంపుపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇంది రమ్మ ఇళ్లను కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని కలెక్టర్ ఎంపీడీఓను ఆదేశించారు. పీడీ హౌసింగ్ రాజేశ్వర్, పెద్దపల్లి ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, హెడ్ మాస్టర్ సతీష్, ఏఈ నరేష్ పాల్గొన్నారు.

● టాస్క్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

పెద్దపల్లి కల్చరల్ : జిల్లాలో ఉన్న ప్రాంతీయ టాస్క్ సెంటర్ ద్వారా అందించే కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో యువతకు ఉపాధి కల్పనపై డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. టాస్క్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

వినోద రంగంలో స్వల్పకాలిక కోర్సులు

సినిమా, వినోద రంగాల్లో స్వల్పకాలిక నైపుణ్య కోర్సులు అందిస్తున్నామని ఆసక్తి గల వారు జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. న్యాక్ ఆధ్వర్యంలో మూడు నెలల సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్, డిజిటల్ డిజైన్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఉంటుందని తెలిపారు.

జిల్లాలో సగటున 71.5 మిల్లీ మీటర్ల వర్షం

● అత్యధికంగా కాల్వశ్రీరాంపూర్‌లో 103.0 మిల్లీ మీటర్లు

పెద్దపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 71.5 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కాల్వశ్రీరాంపూర్ మండలంలో 103.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ముత్తారం మండలంలో 82.2 మిల్లీ మీటర్లు, అంతర్గాం మండలంలో 81.6 మిల్లీ మీటర్లు, ఓదెల మండలంలో 77.0 మిల్లీ మీటర్లు, సుల్తానాబాద్ మండలంలో 75.7 మిల్లీ మీటర్లు, కమాన్‌పూర్ మండలంలో 73.8 మిల్లీ మీటర్లు, మంథని మండలంలో 70.5 మిల్లీ మీటర్లు, రామగిరి మండలంలో 68.7 మిల్లీ మీటర్లు, పాలకుర్తి మండలంలో 67.8 మిల్లీ మీటర్లు, రామగుండం మండలంలో 66.5 మిల్లీమీటర్లు, జూలపల్లి మండలంలో 62.3 మిల్లీమీటర్లు, ఎలిగేడు మండలంలో 61.1 మిల్లీ మీటర్లు, పెద్దపల్లి మండలంలో 55.3 మిల్లీమీటర్లు, ధర్మారం మండలంలో 55.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో జిల్లాలోని పలు చెరువులు, కుంటలు నిండాయి. మానేరు నది కూడా సాగింది. ఓదెల, ముత్తారం, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో పత్తి పంట నీట మునిగింది. అలాగే కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల నుంచి పోచంపల్లికి వెళ్లే దారిలో గల నక్కల వాగుపై ఇటీవల తాత్కాలికంగా కొన్ని పైపులు వేసి నిర్మించిన రోడ్డు వరద నీటికి గండి పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జిల్లా సాధారణ సగటు వర్షపాతం 551.6 మిల్లీ మీటర్లకు గాను, 435.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇంకా 21 శాతం లోటు వర్షపాతం ఉంది. కమాన్‌పూర్, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతానికి చేరుకోలేదు.

విదేశాల్లో ఉద్యోగాల కోసం ఆహ్వానం

● 26న పెద్దపల్లి కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు ● టామ్‌కామ్ ద్వారా దరఖాస్తులు



పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయమైన వేతనంతో విదేశాల్లో ఉద్యోగాలు ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్ ద్వారా అవకాశం కల్పిస్తోంది. విదేశాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరిస్తూ యువత మోసపోకుండా సరైన మార్గనిర్దేశం చేస్తున్నది. అవసరం ఉన్న వారికి శిక్షణ కూడా అందిస్తూ ఉద్యోగావకాశాలను అందిస్తున్నది. ఇందుకోసం ఈ నెల 26న పెద్దపల్లిలోని కలెక్టరేట్‌లో టామ్‌కామ్ ఆధ్వర్యంలో విదేశీ ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆసక్తిగల యువతీ, యువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. చట్టబద్దమైన విదేశీ ఉపాధి అవకాశాలను తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా పొందడం వల్ల అనేక ఉపయోగాలు, ప్రయోజనాలు చేకురుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. టామ్‌కామ్ సంస్థ విదేశీ నియామకదారులతో అనుసంధానం చేసి అవసరమైన డాక్యుమెంటేషన్, శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జపాన్‌లో నర్సింగ్ కేర్ ఉద్యోగానికి వార్షిక జీతం రూ.14 నుంచి రూ.16 లక్షలుగా ఉంది. జర్మనీలో ఎలక్ట్రీషియన్‌కు రూ.32.76 నుంచి రూ.34.80 లక్షలు, ఇజ్రాయిల్‌లో కన్‌స్ట్రక్షన్ వర్కర్లకు రూ.19.20 లక్షలు, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సర్వీస్ టెక్నీషియన్‌లకు రూ.6 నుంచి రూ.10 లక్షలుగా ఉన్నది. ఇంకా గ్రీస్ హౌస్‌కీపింగ్, వెయిటర్, ఎలక్ట్రీషియన్, మేషన్‌లకు రూ.12 లక్షలు సంవత్సర ఆదాయంగా ఉంటుంది. ఇతర ఉద్యోగ అవకాశాలు పోర్చుగల్, యుఏఈ దేశాల్లో కూడా ఉన్నాయని, ఆసక్తి గల వారు టామ్‌కామ్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమల కేంద్రం, జనరల్ మేనేజర్ రూమ్ నెంబర్ 231లో అభ్యర్థులు తమ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారు పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న అవగాహన సమావేశంలో పాల్గొనాలని అధికారులు కోరుతున్నారు.

15న జాతీయ పతాకం ఆవిష్కరించనున్న మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్



కొత్వాల్ సాహెబ్

పెద్దపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన జరగనున్న స్వాతం త్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకల సందర్భంగా రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ సాహెబ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

495 ట్రిప్పులకు రూ.14లక్షల ఆదాయం

● ఇసుక డంప్‌లకు డిమాండ్

కోల్‌సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రామగుండం అర్బన్‌లో ఇటీవల సీజ్ చేసిన ఇసుక డంప్‌లకు భారీ డిమాండ్ పలికింది. బుధవారం జనగామ, ఇందిరమ్మకాలనీ, ఎన్‌టీపీసీ టెలిఫోన్ ఎక్ఛేంజ్ సమీపంలోని మూడు డంప్‌లకు సంబంధించి 495 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ వేలం పాటలు నిర్వహించారు. కనీస ధర రూ.560గా నిర్ణయించారు. కరీంనగర్, ఎన్‌టీపీసీకి చెందిన పలువురు ఈ డంప్‌లను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. కరీంనగర్‌కు చెందిన ఒక వ్యాపారి ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.2,830 చొప్పున వేలం పాటపాడారు. ప్రభుత్వానికి 495 ట్రాక్టర్ ట్రిప్పులకు రూ.14 లక్షల ఆదాయం సమకూరింది.

జనగామ డంప్ అంచనాలపై ఆరోపణలు

పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా ఈ నెల 8న గోదావరిఖని టుటౌన్ పరిధిలోని జనగామ గ్రామ శివారులో కాంపౌండ్ మధ్యన ఉన్న భారీ ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఈ ఇసుక డంప్ 800 నుంచి 900 ట్రాక్టర్ ట్రిప్పులు ఉంటుందని చర్చ జరుగుతోంది. తహసీల్దార్ మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మైనింగ్ అధికారులు వచ్చి 450ట్రిప్పుల డంప్‌గా అంచనా వేశారు. అంతకంటే రెట్టింపు స్థాయిలో ఇసుక ఉంటుందని, తక్కువ అంచనా వేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

● డీఈవో మాధవి

ఓదెల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఈవో మాధవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు మెరుగైన విద్య బోధనకోసం మండలస్థాయి బోధనోపకరణాల మేళాను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా డీఈవో మాధవి హాజరై మేళాను తిలకించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదవ తరగతిలో విద్యార్థులకు పరికరాలతో బోధించడం కోసం బోధన ఉపకరణల మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంతో విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు. అనంతరం మండలంలోని 28మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన 60 బోధనోపకరణాల ప్రదర్శనను డీఈవో పరిశీలించారు.



ఓదెల హైస్కూల్‌లో బోధనోపకరనాల మేళాను పరిశీలిస్తున్న డీఈవో మాధవి

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, ఎంఈఓ రమేష్, ఎస్సై దీకొండ రమేష్, అలాగే కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, లక్ష్మీనారాయణ, హెచ్.ఎం. యేసుదాసు, మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అలాగే సిఆర్‌పి పాల్గొన్నారు.

మండల స్థాయి టీఎల్ఎం మేళా

పెద్దపల్లికల్చరల్ : ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయులకు మండలస్థాయిలో టీఎల్ఎం మేళా నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. పెద్దపల్లి జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ అధికారి పీఎంషేక్, రాఘవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాలుక హన్మంతరావు, అప్పన్నపేట, రాగినేడు స్కూల్ కాంప్లెక్స్ ప్రధా నోపాధ్యాయులు పురుషోత్తం, ఆగయ్య పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా ఎల్ఎఫ్ఎల్ ప్రధానో పాధ్యాయులు మనోహర్, కిష్టారెడ్డి, ఎస్తారు, వెంకటస్వామివ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

● పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలన, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పని చేద్దామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. నాషా ముక్త్ భారత్ అభియాన్-2025లో భాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మాదక ద్రవ్యదుర్వినియోగం, దుష్ప్రభావాల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నాషాముక్త్ భారత్ అభియాన్‌ను అమలు చేస్తుందన్నారు. ఈ అవగాహన ప్రచారం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రతిజ్ఞ నిర్వహిస్తున్నట్టు సీపీ పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కమిషరేట్ పరిధిలో గంజాయి సాగుచేసినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదని, షీట్లు తెరిచి పీడీ యాక్టులు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, యాంటీ నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సీసీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సతీష్, సీఐ రవీందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాబురావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు భీమేష్ ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

న్యాయవాదినంటూ..
మోసం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సిరిసిల్లక్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదినంటూ పలువురిని మోసం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. సిరిసిల్ల పట్టణ సీఐ కె కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏనుగు ఫణీందర్ అనే వ్యక్తి న్యాయవాదిలా చలామణి అవుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నాడు. మచ్చ నారాయణ అనే వ్యక్తి కొడుకుకు విడాకులు ఇప్పిస్తానని చెప్పిన ఏనుగు ఫణీందర్ ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నాడు. ఆ బాండ్ పేపర్లపై మచ్చ నారాయణకు చెందిన ఇంటిని బొల్లి మార్కండేయ, బాల కృష్ణలకు అమ్మినట్లు నకిలీ పత్రాలను సృష్టించాడు. ఇంటిని అమ్మినట్లు సృష్టించిన పత్రాలతో మచ్చ నారాయణను బెదిరించి వారి నుంచి 11లక్షల 60వేల రూపాయలు తీసుకున్నాడు. ఈ విషయమై మచ్చనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు ఏనుగు ఫణీందర్, బొల్లి మార్కండేయలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. కాగా జైలు నుంచి వచ్చిన ఏనుగు ఫణీందర్ బొల్లి మార్కండేయ కొడుకు బాలకృష్ణను సైతం పోలీసులు అరెస్టుచేస్తారని తనకు హైకోర్టు న్యాయవాదులు తెలుసునని బాలకృష్ణను అరెస్టు చేయకుండా బెయిలు తీసుకు వస్తానని చెప్పాడు. లక్షా11వేల రూపాయలు తీసుకుని బెయిల్ ఇప్పించకుండా మోసం చేశాడు. దీంతో బొల్లి మార్కండేయ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

వెల్గటూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం పాశిగామా హరిత హోటల్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడి గణేష్ (24) అనే యువకుడు, ముచ్చకుర్తి అనిల్(25) అనే కానిస్టేబుల్ మృతి చెందారు. ఎస్ఐ ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సు పాశిగామ సమీపంలోని హరిత హోటల్ వద్ద గేదెను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న లక్షెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన మేడి గణేష్, ముచ్చకుర్తి అనిల్ తీవ్రంగా గాయపడగా అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన గణేష్‌ను ఆసుపత్రి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యలో మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

గోడ కూలి ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీవర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో, పత్తిచేనుల్లో నీరు నిలవడంతో పాటు కొన్ని గ్రామాల్లో పురాతన ఇళ్లు నేలకులాయి. పెద్దబొంకూర్ గ్రామంలో కురిసిన వర్షానికి ఎలిగేటి రాయమల్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడుతున్న తరుణంలో రాత్రి కురిసిన వర్షానికి గోడకూలింది. ఈ ప్రమాదంలో అతడి కుమారుడు శేఖర్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అలాగే బొంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరదనీరు నిలిచిపోయింది.

రోడ్డుపై నిలిచిపోయిన భారీ వాహనం

● ట్రాఫిక్‌కు అంతరాయం


నిలిచిపోయిన భారీ వాహనం

శంకరపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాన్ని తీసుకెళ్తున్న లారీ రోడ్డుపై నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శంకరపట్నం మండలం లోని కల్వల గ్రానైట్ క్వారీకి భారీ గ్రానైట్ రాళ్లను లారీల్లోకి ఎత్తే వీల్ లోడర్‌ను తరలిస్తున్నారు. ఈ క్రమంలో నేషనల్ హైవేనుంచి మొలంగూర్‌కు ఎక్స్‌రోడ్‌వైపు తిరగగానే ఆ వాహనం రాడ్ విరిగి లారీ అక్కడే నిలిచి పోయింది. ఈ వాహనం పూర్తిగా రోడ్డుకు అడ్డుగా ఉండడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్స్‌కవేటర్ తో లారీ వెనకాల మట్టి పోసి వీల్ లోడర్‌ను కిందకి దించారు. తర్వాత మరమ్మతు చేసి లారీని అక్కడి నుంచి తరలించారు.

ఆర్థికాభివృద్ధిలో ఆదర్శం

స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందుకోనున్న ఆదర్శ మండల సమాఖ్య

ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన సభ్యులు

ఇల్లంతకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : 'జీవితాన వెలుగుందనే నమ్మకాన్ని పెంచుదాం.. స్వర్గమనేదెక్కడున్నా నేలపైకి దించుదాం..' అనే ప్రార్థనా గీతంతో మహిళా సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయి. సమష్టి నిర్ణయాలతో ఆయా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధిలో ఆదర్శంగా నిలిచి జాతీయస్థాయిలో పురస్కారాన్ని అందుకోబోతున్నారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య 2004లో ఏర్పాటు కాగా, ప్రస్తుతం 46 గ్రామైక్య సంఘాలతో, 1103 స్వశక్తి సంఘాలలో 12420మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ వాటి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందిన అనంతరం రికవరీ చేస్తున్నారు. సామాజిక రుగ్మతలపై మహిళలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు.

మహిళా సంఘ సభ్యుల పురోగతి..

మండలంలోని పలు గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు. మహిళలు సంఘాల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారు. వ్యక్తిగత రుణాలు తీసుకొని పాడి ఆవులు, లేడీస్ ఎంపోరియంలు, బట్టల దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద గ్రామైక్య సంఘాలకు వచ్చిన రూ.1.30కోట్లతో కోడిపిల్లల పెంపకం, క్యాంటీన్లు, కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. కందికట్కూర్, గాలిపెల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల యూనిఫామ్స్ కుడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సంఘంలోని ప్రతి మహిళ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తుండటం వల్ల సమాఖ్య రూ.59కోట్ల రుణాలు పంపిణీ చేసి 99శాతం రికవరీ చేసింది.


కందికట్కూర్‌లో కుట్టుశిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న మహిళలు

ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శం

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణ మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించగా మండలంలోని మహిళా సంఘాలు ముందుకు వచ్చాయి. 28గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, మండలకేంద్రంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు నడిపించారు. 28లక్షల 80వేల క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.99లక్షల కమీషన్ పొందారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు, గడ్డిచుట్టే యంత్రాలు కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. మండల కేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

దేశవ్యాప్తంగా ఉత్తమ మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనితీరును పరిశీలించారు. ఉత్తమ సేవలు అందించే సమాఖ్యలకు 2024 ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డులకు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 22మహిళా సంఘాలను ఎంపిక చేయగా సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని ఇల్లంతకుంట ఆదర్శ మండల సమాఖ్య రెండో స్థానంలో ప్రతిభ కనబర్చింది. ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే ఉత్సవాల్లో అవార్డు అందుకోనున్నారు. సమాఖ్య అధ్యక్షురాలు వల్లంపట్ల గ్రామానికి చెందిన కట్ట సౌమ్య, మాజీ అధ్యక్షురాలు వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన బొడిగె వనజలు ఢిల్లీ వెళ్లారు. ఆదర్శ మండల సమాఖ్య సభ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించడంతో పాటు నిరంతర ఆదాయం కోసం గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీవోకు ఆదేశాలు ఇవ్వడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫామ్స్ కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా..



రంగు రేణుక, కందికట్కూర్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. కందికట్కూర్‌లో 12మంది సభ్యులం కలిసి కేంద్రంలో రెండు నెలలపాటు యూనిఫామ్స్‌కుట్టడం ద్వారా రూ.4లక్షల వరకు ఆదాయాన్నిపొందాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాణిస్తున్నాం.

క్యాంటీన్‌తో ఉపాధి పొందుతున్నా..



బండారి స్వాతి, ఇల్లంతకుంట

గీతకార్మికుడైన నా భర్త రమేష్ మృతి చెందాడు. కుటుంబ పరిస్థితుల వల్ల ఏదైన వ్యాపారం చేయాలనే ఆలోచనతో ఇందిరా మహిళాశక్తి కింద బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.3లక్షల రుణం తీసుకొని ఇల్లంతకుంటలో క్యాంటీన్ ఏర్పాటు చేశాను. మొదట్లో కొంత ఇబ్బంది అయినా ప్రస్తుతం బాగానే నడుస్తోంది. ఆర్డర్‌పై ఆహారాన్ని అందిస్తూ పిల్లలను పోషించుకుంటున్నాను. రుణాన్ని సకాలంలో చెల్లిస్తున్నాను. కుటుంబానికి తోడ్పాటు అందించిన ప్రభుత్వానికి, అధికారులకు రుణపడి ఉంటాను.

మహిళలు మరింత రాణించాలన్నదే లక్ష్యం



కట్ట సౌమ్య, ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షురాలు

మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మండలంలోని సంఘాల్లో ఉన్న మహిళలు మరింత రాణించాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తా. ఇప్పటివరకు ఏ గ్రామంలోనైనామహిళలు సంఘంలో లేకపోతే కొత్త సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తా. సామాజిక రుగ్మతలపై మహిళల్లో చైతన్యం కల్పిస్తూ ముందుకు సాగుతున్నా. ఈనెల 15న ఢిల్లీలో అవార్డు తీసుకోవడానికి బయలుదేరాం.

బీఎడ్ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎడ్ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ పరీక్షలు నియంత్రణ అధికారి డి సురేష్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ నెల 14వతేదీ నుంచి 29వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు కూడా ఈనెల 14వ తేదీ నుంచి 25 వరకు జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, కళాశాలలోగానీ సంప్రదించాలని సూచించారు.

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సుంకరి ఓదెలుకు చెందిన నాలుగు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి ఎత్తికెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎత్తుకెళ్లిన మేకల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంబర్ ప్యాకెట్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న అంబర్ ప్యాకెట్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలో అక్రమంగా అంబర్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఆటోలో ఒక లక్ష రూపాయల విలువ చేసే అంబర్ ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన అంబర్ ప్యాకెట్లు, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నాలుగు రోజులైనా అదుపులోకి రాని మంటలు

● గోదాంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారులు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరగ్గా మంటలు నాలుగురోజులైనా అదుపులోకి రాలేదు. రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయినా గోదాం నుంచి దట్టమైన పొగతో మంటలు వ్యాపించడంతో ఎక్స్‌కవేటర్లతో కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. తీసిన సంచుల నుంచి మళ్లీ మంటలు రాకుండా వాటిపై ఇసుక పోస్తున్నారు. గోదాంలోని గోనె సంచుల కింద వేసిన కట్టెలు ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. గోనెసంచులు పూర్తిగా కాలిపోవడంతో రూ.97లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. గోదాం దెబ్బతినడంతో రూ.70లక్షల వరకు నష్టం వచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు. గోదాంను బుధవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించి మంటలను అదుపు చేసేలా తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంటలను గురువారం పూర్తిస్థాయిలో అదుపులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఆర్డీవో వెంట ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, వరప్రసాద్, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్, ఎస్సై-2 రాజునాయక్ ఉన్నారు.

150 గ్రాముల గంజాయి స్వాధీనం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి వద్ద ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులవద్ద 150గ్రాముల నిషేధిత గంజాయి పట్టుకున్నారు. నిందితులు షేక్ గౌస్, మహ్మద్ షారు, మహ్మద్ సాహెబ్‌పై కేసు నమోదు చేశామని, 2బైక్‌లు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నిందితులు నాగ్‌పూర్‌లో గంజాయిని కొనుగోలు చేసి చింతకుంటలో ఎక్కువధరకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు

వెల్గటూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి 10రోజుల జైలుశిక్ష విధిస్తూ ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏగి జానకి బుధవారం తీర్పునిచ్చారు. వెల్గటూర్ ఎస్ఐ ఉమసాగర్ తమసిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ జిల్లాకుచెందిన కండెల ప్రశాంత్(28) పట్టుబడ్డాడు. అతడిపై కేసునమోదు చేసి ధర్మపురికోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ జానకి విచారించి ప్రశాంత్‌కు పది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం

● ఇండియాస్ 100మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ జాబితాలో చోటు


మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్/మంథని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అనలిటిక్స్ ఇండియామ్యాగజైన్ తాజాగా ప్రకటించిన ఇండియాస్ 100మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ-2025 జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్న వ్యక్తులతోపాటు, సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న వారికి ఈ జాబితాలో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతిఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు దేబజాని ఘోష్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఎంపికపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే తనకు ఈ గుర్తింపు వచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇది తెలంగాణ ప్రజలందరికీ దక్కిన గౌరవం అని స్పష్టం చేశారు.

నానో యూరియాపై
అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా (లిక్విడ్ యూరియా) వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి మండలంలోని డీసీఎంఎస్ చింతకుంట ఫర్టిలైజర్ దుకాణాన్ని, గోదాంను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎరువుల వ్యాపారస్తులు విధిగా టార్పాలిన్ షీట్,దానిపై వరిఊకను వేసి ఎరువు లను నిల్వ చేయాలని సూచించారు. యూరియా బదులుగా అందుబాటులో ఉండే అమ్మోనియా సల్ఫేట్‌వంటి నత్రజని ఎరువులను వాడుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, సహాయవ్యవసాయ సంచాలకులు రణధీర్‌కుమార్, కొత్తపల్లి మండల వ్యవసాయాధికారి కృష్ణ ఉన్నారు.

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన తాళ్లపల్లి పోచమల్లు అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇంటిలో బుధవారం దొంగతనం జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఫంక్షన్ కోసం సుల్తానాబాద్ వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికిరాగా ఇంటితాళం పగులగొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలోని నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు 50వేల రూపాయల నగదు, పది తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నరేష్ రెడ్డి, క్లూస్‌టీం పరిశీలించారు. కాగా దొంగతనంపై ఇంకా ఫిర్యాదు రాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళను కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను కరీంనగర్ లేక్ అవుట్ పోస్ట్ పోలీసులు బుధవారం రక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌కుచెందిన మల్యాల రాజేశ్వరి (43) భూసమస్యల కారణంగా మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. లేక్ అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎంఏ హఫీజ్‌బేగ్ గమనించి ఆమెను కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటికే ఆమెపై చందుర్తి పోలీసు ఠాణాలో అదృశ్యం కింద కేసు నమోదైనట్లు గుర్తించి, అక్కడిపోలీసులకు అప్పగించారు.

వేర్వేరు కేసుల్లో నలుగురు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

● బంగారం, వెండి, నగదు స్వాధీనం ● బంగారం కొనుగోలుదారుడి అరెస్టు



మానకొండూర్ పరిధిలో చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితుల అరెస్టును చూపుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల చోరీలకు పాల్పడిన నలుగురు అంతర్ జిల్లా దొంగలతోపాటు దొంగసొత్తు కొనుగోలుదారుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద బంగారం, వెండి, నగదుస్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీసు కమిషనరేట్‌కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దీకంపల్లికి చెందిన టేకు గంగ సాయిలు(55), టేకు భూమయ్య(48) అన్నదమ్ములు. కూలి పనులు చేసుకునే వీరు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసు కమిషనరేట్‌లోని మానకొండూర్, శంకరపట్నం, గంగాధర, రామడుగు మండలాల్లో దొంగిలించిన బంగారాన్ని నిర్మల్‌కు చెందిన ఉప్పుల వేణు సహాయంతో నిర్మల్‌లోని భార్గ ఎక్నాత్‌శేల్కే అమ్ముతుండేవారు. ఇతను బంగారు షాపు నడుపుతూ దొంగిలించిన ఆభరణాలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో వేణు పరారీలో ఉండగా గంగసాయిలు, భూమయ్యతోపాటు మహారాష్ట్రలోని షోలాపూర్‌కు (ప్రస్తుతం నిర్మల్ జిల్లా మంజులాపూర్‌లో నివాసం) చెందిన భార్గఎక్నాత్ శేల్కే(34)ను అరెస్టుచేశారు. వీరివద్ద 45తులాల బంగారం, 170తులాల వెండి, లక్షా 40వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఏసీపీవెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసింహులు, మానకొండూర్ సీఐ సంజీవ్, సీఐ ప్రకాష్, ఎస్సై స్వాతి, సిబ్బందినిసీపీ అభినందించారు.

● కరీంనగర్‌లోని వివేకానందపురి భార్గవి ఎంక్లేవ్, వెంకటేశ్వర రెసిడెన్సీలలోని రెండు ఫ్లాట్‌లలో ఈనెల6న రాత్రి సుమారు 32తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈకేసులో రంగారెడ్డి జిల్లా గడ్డి అన్నారంలో నివాసం ఉంటున్న కరీంనగర్‌కు చెందిన దినేష్‌రాజ్ పురోహిత్ అలియాస్ ఠాకూర్ జగన్‌సింగ్ అలియాస్ డీజే(30), కరీంనగర్ జవహర్ నగర్‌లో నివసిస్తున్న కొత్తోజు సందీప్‌చారి అలియాస్ సందీప్(26)ను అరెస్టు చేశారు. 32తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. గతంలో నేరాలకుపాల్పడిన ఈఇద్దరికి చర్లపల్లి జైలులో ఉండగా పరిచయం ఏర్పడింది. జైలునుంచి విడుదలైన తరువాత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకొని అప్పులు చేశారు. అప్పులను తీర్చడానికి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డారు. కరీంనగర్‌లో చోరీచేసిన బంగారాన్ని ఎల్లారెడ్డిగూడలోని ఒకఫైనాన్స్‌లో కుదువ బెట్టి డబ్బులు తీసుకున్నారు. కేసును ఛేదించిన ఏసీపీ ఎన్ వెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసిం హులు, మూడోఠాణా సీఐ జాన్‌రెడ్డి, సీఐ ప్రకాష్, ఎస్సైలు చేరాలు, రమేష్‌తోపాటు సిబ్బందిని సీపీ అభినందించారు.

11కేవీ వైర్లు తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన బాసుమియా అనేవ్యక్తి 11కేవీ వైర్లు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. బాసుమియా బుధవారం వర్షం కురుస్తుండగా ఇంటిపైకిఎక్కి పరదాను సరిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆయన ఇంటి పైనుంచి వెళ్లుతున్న 11కేవీ కరెంటు వైర్లు అతని చేతికి తగిలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాసుమియాను జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం దొంతుల గంగయ్య అనేవృద్ధుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో గంగయ్య తీవ్రంగా గాయపడటంతో అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. రామగుండం మండలం గోలివాడకు చెందిన ఆయన మండల కేంద్రంలోని ఓ వివాహ వేడుకలో పాల్గొని రోడ్డు దాటే క్రమంలో కారు ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు సంఘ టన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పాలకుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లిలో ఇటీవల చోరీకి పాల్పడ్డ నిందితుడిని బసంత్‌నగర్ పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ పుల్ల కరుణాకర్ వివరాలు వెల్లడించారు. అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన పరకాల అశోక్ కొన్నిరోజులుగా మద్యానికి అలవాటుపడి డబ్బు కోసం చోరీలు చేస్తున్నాడు. ఈసాలతక్కళ్లపల్లిలో దాడి నాగరాజు ఇంటికి తాళంవేసి ఉండగా తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 2తులాల బంగారు గొలుసు,పుస్తెలతాడు చోరీ చేశాడు. అదే గ్రామానికి చెందిన పెసరి మల్లేష్ ఇంటికి వేసిన తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న 3తులాల బంగారు హారం చోరీ చేశాడు. సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్‌లో రాత్రివేళ ఓ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోఉన్న వెండి, బంగారు అభరణాలను దొంగిలించాడు. తాగినమైకంలో బంగారు అభరణాలను ఎక్కడో పడవేయగా మిగతా వెండి వస్తువులను, ఈసాలతక్కళ్లపల్లిలో దొంగలించిన 3తులాల బంగారు ఆభరణాలతో బుధవారం పెద్దపల్లికి వెళ్తుండగా బసంత్‌నగర్ బస్టాప్‌వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతనివద్దనుంచి 3తులాల బంగారు హారం, వెండివస్తువులు సీజ్‌చేసి నిందితుడిని అరెస్టుచేసినట్లు వెల్లడించారు. నేరస్తుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ ఆర్‌స్వామి, సిబ్బందిని ఏసీపీ గజ్జికృష్ణ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లికి చెందిన లెక్కల ప్రశాంత్ ఈ నెల 9న తన మొబైల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల బ్రిడ్జి వద్ద పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. యజమానికి బుధవారం కరీంనగర్ రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి అప్పగించారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. వారివద్ద రూ.15,700నగదు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నవ్య

కుటుంబ కదంబం

గురువారం
14 ఆగస్టు 2025



"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి.

'స్వరాజ్యం మా జన్మహక్కు.'

అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.



ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్లు

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి.



మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.

ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు.

ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి నూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహరీ బాయి, 102 ఏళ్లు

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

• సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

చొప్పదండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు తేదీని ఈనెల 27వరకు పొడిగించినట్లు తెలిపారు. బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారని, బాలికలు అధిక సంఖ్యలో దరఖాస్తులను చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు చీర, సారెతో హాజరు



లబ్ధిదారులకు చీర, సారెను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు నూతన కడప ఏర్పాటుకు చీర, సారెతో ఆది శ్రీనివాస్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో చాలా ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఇప్పటికే బేస్మెంట్ పూర్తి చేసుకుని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మ గౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపా రు. గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మాణం చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి చీర, సారెతో వస్తానని చెప్పిన మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకా రం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి చీర, సారెతో వచ్చానని గుర్తుచేశారు.

ఆర్టీసీకి రాఖీ బొనాంజా

రీజియన్ వ్యాప్తంగా రూ. 15 కోట్లకు పైగా ఆదాయం



భగత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు ఐదు రోజుల్లో 15 కోట్లకు పైగా ఆదా యాన్ని సమకూర్చుకున్నది. కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా 15.48 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. రీజియన్ వ్యాప్తంగా రాఖీ పండుగను పురస్కరించుకుని వివిధ డిపోల నుంచి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపించి ఆదాయం సమకూరే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

మహిళలే అధికం

రీజియన్ వ్యాప్తంగా పురుషులకన్నా మహిళలే అధికంగా ప్రయాణించారు. రీజియన్ వ్యాప్తంగా 29,10,435 మంది ప్రయాణించగా అందులో మహాలక్ష్మి పథకం కింద మహిళలు 21,21,668, పురుషులు 7,88,767మంది ప్రయాణించారు. గోదావరిఖని డిపోకు రూ. 2.23 కోట్లు, హుస్నాబాద్‌కు 87.34 లక్షలు, హుజూరాబాద్‌కు 1.17 కోట్లు, జగిత్యాలకు 1.78 కోట్లు, కరీంనగర్-1కు 1.59 కోట్లు, కరీంనగర్-2కు 2.41 కోట్లు, కోరుట్లకు 1.14 కోట్లు, మంథనికి 85.4 లక్షలు, మెట్‌పల్లికి 1.07 కోట్లు, సిరిసిల్లకు 1.17 కోట్లు, వేములవాడకు 1.14 కోట్ల ఆదాయం వచ్చింది.

ఆర్టీసీని ఇలాగే ఆదరించాలి



బి రాజు, రీజినల్ మేనేజర్

రాఖి పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించడంతో అధిక ఆదాయం సమకూరింది. ప్రణాళికా బద్ధంగా అన్ని డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను నడిపించాం. ఆర్టీసీ ఆదరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు. అంకిత భావంతో పనిచేసిన ఆర్టీసి సిబ్బందికి అభినందనలు.

కొండగట్టులో పోలీసుల తనిఖీలు

- డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాల స్పెషల్ డ్రైవ్
- ఆలయాల వద్ద భద్రత కట్టుదిట్టంలో భాగంగా చర్యలు



ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మల్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భద్రతపై బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భద్రత చర్యలను బలోపేతం చేయడం కోసం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఆలయ ప్రధాన ద్వారం, మండపం, భక్తుల ఆలయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, వసతిగృహాలు తదితర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పుణ్యక్షేత్రాల వద్ద భద్రత చర్యలు మరింత కట్టుదిట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌కుగాని డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై నరేశ్ కుమార్, డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలు పాల్గొన్నాయి.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 12,769 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 12,769 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 45.161 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 4,163 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందు లో కాకతీయ కాలువకు 2,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూ సెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 39.713 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.563 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.


ఉప్పొంగంగా..

పంప్‌హౌస్‌ల నుంచి ఎత్తిపోతలు ప్రారంభం



రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రవహిస్తున్న నీరు

ధర్మారం/రామడుగు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి లింక్ -2 నంది పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. నంది మేడారం సమీపంలోని నంది పంప్‌హౌస్‌కు గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి నుంచి నీటిని వదిలి పెట్టగా, అక్కడి నుంచి మూడు మోటార్లను ప్రారంభించి 9,450 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షాలతో కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. అక్కడి నుంచి 11,478 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా వదిలి పెట్టడంతో ఆ నీటితోపాటు, పరివాహక ప్రాంతం నుంచి 7,584, మొత్తం 19,062 క్యూసెక్కుల వరద నీరు ఎల్లంపల్లికి వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు 14.069 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ క్రమంలో ముందస్తు చర్యగా మండలంలోని నంది మేడారంలోని నంది పంపు హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్‌లో మూడు మోటార్లను ఆన్ చేసి అంతే నీటిని గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అక్కడి నుంచి నేరుగా వరద కాలువ ద్వారా శ్రీ రాజ రాజేశ్వర డ్యాంకు నీరు ప్రవహిస్తుంది. ఈ ప్రక్రియ వారంపాటు కొనసాగుతుందని అధికారులు తెలి పారు.



ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి



గోదావరి నుంచి భక్తులను బయటకు తీసుకు వస్తున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద బుధవారం గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె నీటిలో మునిగి గోదావరి నదీ స్నానఘట్టాలు ఆనుకొని గోదావరి వరద కొనసాగుతోంది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది మైకుల ద్వారా అప్రమత్తం చేశారు. కొందరు భక్తులు లోతు ప్రదేశాల్లో స్నానాలు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్ రావు ప్రజలను అప్రమత్తం చేశారు.



గోదావరి ఉధృతి

ఘనంగా జనక్ ప్రసాద్ జన్మదినం

గోదావరిఖని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్ 73వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా స్థానిక గౌతమినగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అంతరం స్థానిక జనక్ భవన్‌లో నాయకులు, కార్యకర్తల సమక్షంలో జనక్ ప్రసాద్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అంతరం మొక్కలు నాటి అమ్మ పరివార్, మనో చైతన్యలో అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ నాయకులు, ఆర్‌జీ-1, 2, 3, మందమర్రి, శ్రీరాంపూర్ చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల స్థాయి టీఎల్ఎం మేళా ప్రారంభం

ధర్మారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో పెద్దపల్లి జిల్లాను ముందు వరసలో నిలిపేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా ఆకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పి.ఎం.షేక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్ - టీఎల్ఎం మేళాను ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ప్రారంభించగా, పి.ఎం.షేక్. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల విద్యాధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎం దమ్మాల పోచం, సీసీ సత్యనారాయణ, డీఆర్పీలు సంపత్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖనిలో పేద మహిళలకు చీరల పంపిణీ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గురువు జన్మదినం సందర్భంగా విద్యార్థి నిరుపేదలకు చీరలు అందజేసి గురుభక్తిని చాటుకుంది. రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ అమరేందర్ జన్మదినం సందర్భంగా యూట్యూబ్‌స్టార్, జబర్ధస్త్ ఫేమ్ వర్షిని వరుమని ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలోని కోదండ రామాలయం సమీపంలో పేద మహిళలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దయానంద్‌గాంధీ, మేజిక్‌రాజా, మేజిక్ హరి, దామెర శంకర్, సర్వేష్, కుమార్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీల చిత్రపటాలకు క్షీరాభిషేకం

పాలకుర్తి,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామంలో బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, శ్రీనుబాబు చిత్ర పటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొగరి తిరుపతి మాట్లాడుతూ గోధావరిఖని, కన్నాల గ్రామాలను కలిపే రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణలు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అరుకాల సతీష్, లాల్ సింగ్, కాలువ తిరుపతి, వేల్పుల రాజ్‌కుమార్, బాల్య నాయక్, అఫ్జల్, తిరుమల హరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు అస్వస్థత

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని వెన్నంపల్లి సబ్‌సెంటర్‌లో కాంట్రాక్టు ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న శైలజ బుధవారం అస్వస్థతకు గురయ్యారు. డ్యూటీ డాక్టర్ భావన ప్రథమ చికిత్స చేసిన తర్వాత మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం హన్మకొండలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స జరిపిస్తున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనుగోలు కేంద్రం కేటాయించాలని ఆర్డీవోకు వినతి

కమాన్‌పూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల శివారులో ప్రభుత్వ భూమిని ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని కోరుతూ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రావు బుధవారం మంథని ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగాల రెవెన్యూ శివారులోని 84ఏ,1, 84ఏ,2 సర్వే నెంబర్‌లలో 7.30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉందని, దానిని లింగాల నాగారం ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని ఆర్డీఓ సురేష్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలపై పోలీసుల అవగాహన

ముత్తారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నివారణపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మధునయ్య మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. సౌజన్య, కానిస్టేబుల్స్ జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించేందుకు సైన్స్ ల్యాబ్‌లు

గోదావరిఖని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు సైన్స్ ల్యాబ్‌లు దోహదపడతాయని అంతర్గాం మండల విద్యాధికారి యాకంబరం అన్నారు. బుధవారం కుందనపల్లి సమీప అక్బర్‌నగర్‌లో గల లిటిల్ సిటిజన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల డైరెక్టర్ బోగ నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు కొమ్మిడి సమ్మిరెడ్డి, అబ్దుల్ సలీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ మహిళా సంఘాలకు అప్పగించాలి

● అంతర్గాంలో రూ.2కోట్లతో ఫంక్షన్‌హాల్ ● రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ మొక్కల పెంపకానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని, మొక్కలు నాటడం, సంరక్షించే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తే అవినీతికి తావులేకుండా ఉంటుందని, ఫలితాలు కూడా ఉంటాయని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ కుటుంబ సభ్యుల పేర మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణానికి మేలు చేసినవారవుతారన్నారు. స్వశక్తి మహిళలను వివిధ వ్యాపారాల్లో భాగస్వాములను చేసి కోటీశ్వరులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అంతర్గాంలో రూ.2కోట్లతో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. నగరంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో తవ్వకాలు, కొన్ని తాత్కాలిక ఇబ్బందులు ఉంటాయని, వాటి విషయంలో సర్దుకొని సహకరించాలన్నారు. ఇందిరానగర్ ఇందిరమ్మకాలనీ, పీకేరామయ్య కాలనీ, తదితర మురికి వాడల్లో సకల వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. సప్తగిరికాలనీలో వరద కాలువలు నిర్మించామని, భవిష్యత్‌లో సప్తగిరికాలనీలో వరద ముంపు ఉండదన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ వన మహోత్సవంలో రామగుండంలో 4.8లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో 1.92లక్షలు ఇంటింటా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్, వనమహోత్సవ డీఈ షాబాజ్, ఏఈ తేజస్వి ని, జూనియర్ అసిస్టెంట్ సాయి, మెప్మా టీఎంసీ మౌనిక, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మొక్కలు అందిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నిర్మాణ పనులకు శంకుస్థాపన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధి మల్కాపూర్ శివారులోని డంపింగ్ యార్డులో రూ.83లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణ, డీసీ వెంకటస్వామి, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాష్, గట్ల రమేష్ పాల్గొన్నారు.

మిడ్‌మానేరుకు గోదావరి జలాలు

(5వ పేజీ తరువాయి)

గాణ వర్షాలు కురవక ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగడంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలో సీపేజీలు రావడం, ఎన్‌డీఎస్ఏ అధికా రులు నీటిని నిల్వ చేయకుండా ఓపెన్ ఫ్రీ బ్యారేజీలుగా ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ మేరకు గత ఏడాది నుంచి ఓపెన్ ఫ్రీ చేయడంతో అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయడం లేదు. గత ఏడాది జూలై మాసంలో భారీ వర్షాలు కురవడంతో ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు అవసరాన్ని బట్టి నీటిని తరలించారు. వర్షాలకు తోడు నీటిని ఎత్తిపోయడం వల్ల మిడ్ మా నేరు, ఎల్ఎండీ నిండింది.

ఎస్సారెస్పీ నిండిన తర్వాత వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు నీటిని విడుదల చేసిన తర్వాత అక్కడి నుంచి మల్లన్న సాగర్‌కు తరలిం చారు. అయితే ఈ ఏడాది ఈ ప్రాంతంలో వర్షాలు ఆశాజనకంగా కురవడం లేదు. వారం రోజుల క్రితం ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి ఒక్క రోజులోనే 10 టీఎంసీల వరకు నీళ్లు చేరాయి.

సజీవంగా అతని నేత్రాలు

ఎలిగేడు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన తీగల నరేష్ కళ్లు సజీవంగా నిలిచాయని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి బీష్మాచారి తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో బుధవారం నరేష్ సంస్మరణ సభలో మాట్లాటారు. ఈ సందర్భంగా మృతుని భార్య మమత, తల్లితండ్రులు సత్తెమ్మ, వెంకటయ్య, కూతుళ్ల అవంతిక, నిశిక, తమ్ముళ్ల అశోక్, సుమన్‌లకు జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అర్షనపెల్లి వెంకటేశ్వర్ రావు, సదాశయ జాతీయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవన్ కుమార్, పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు రమేష్, అశోక్ పాల్గొన్నారు.

అవయవదానం మానవత్వానికి ప్రతీక

రామగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అవయవదానం మానవత్వానికి ప్రతికగా నిలుస్తోందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతీ అన్నారు. అవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతీ, డైరెక్టర్ గంటవెంకటరమణరెడ్డి అవయవదాన అంగీకార పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ సెంటినరీ కాలనీ ఇన్‌చార్జి నూక రమేశ్‌కు అందజేశారు.

ఆకట్టుకున్న ఎఫ్ఎల్ఎన్ టీఎల్ఎం మేళా

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్‌టీఎల్ఎం మేళాను మండల విద్యాధికారి మహేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సులభతరంగా బోధించేందుకు, అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఈ మేళాలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, పెగడపల్లి, మల్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సునీత, కోటేశ్వర్‌రావు, మధు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సహకార సంఘం పెద్దపీట

కమాన్‌పూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కమాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి సహకరిస్తున్నదని సింగిల్ విండో ఛైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు తెలిపారు. బుధవారం ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ హయాంలో రూ.7.85 కోట్ల పంట రుణాలు మంజూరు చేశామన్నారు. అలాగే 1.56 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు జరిగాయ ని, దీని ద్వారా సన్న వడ్లకు రూ.5.96 కోట్ల బోనస్ రైతులకు జమ చేసినట్లు తెలిపారు. సహకార సంఘం వైస్ ఛైర్మన్ చిందం తిరుపతి, సీఈఓ తిమ్మరాజు సంతోష్‌కుమార్, డైరెక్టర్ గుండేటి శ్రీమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు బుధవారం పెద్దపల్లి పట్టణంలో తిరంగ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ మే నెలలో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దమనకాండకు ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించిందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, పెద్దపల్లి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కావేటి రాజగోపాల్, సీనియర్ నాయకులు తంగేడు రాజేశ్వరరావు, సంపత్‌రావు పాల్గొన్నారు.

● **కాల్వశ్రీరాంపూర్** : బీజేపీ జాతీయ, రాష్ట్ర పార్టీల పిలుపు మేరకు మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉప్పుల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి గరిడే కిషన్, మండల ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాములు, యాట నరేష్, కార్యదర్శి కొత్తగట్టు నాగరాజు, చొప్పరి సదానందం, సిరిపురం రమేష్, సముద్రాల శ్రీను, రాగుల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **కమాన్‌పూర్** : బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని షాపింగ్ కాంప్లెక్స్ నుంచి హర్ ఘర్ తిరంగా జెండా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్, సీనియర్ నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, పెద్దపల్లి శ్యామ్, పంతకాని విశ్వతేజ, కొమ్ము శ్రీనివాస్, మోర ప్రశాంత్, మండల సంతోష్, జంగపెల్లి అభి పాల్గొన్నారు.



పెద్దపల్లి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

మంథని : తమ ఇంటి పైన ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. నేతలు చల్లా నారాయణరెడ్డి, కొండపాక సత్యప్రకాష్, సబ్బని సంతోష్ పాల్గొన్నారు.

భారీ వర్షంతో పత్తి పంటలకు తీవ్ర నష్టం

ఓదెల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షంతో పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఓదెల మండలంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం 8 గంటల వరకు 77.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షంతో వివిధ గ్రామాల్లోని పత్తి పంటల్లోకి వరద నీరు వచ్చి చేరాయి. అలాగే మండలంలోని భాయమ్మ పల్లెలో కుక్కల మధునమ్మ అనే వృద్ధురాలికి చెందిన ఇల్లు భారీ వర్షం వల్ల పైకప్పు కూలిపోయింది. ఓదెలతో పాటు కనగర్తి, కొలనూర్, కొమిర, పొత్కపల్లి, గుంపుల, గూడెం తదితర గ్రామాలలో చెరువులు, కుంటలు నిండుకున్నాయి. అలాగే కనగర్తి ఊర చెరువు ప్రమాద స్థాయికి చేరుకుంది. దీంతో రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు దాటడానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రమాదాలు జరగకుండా పోత్కపల్లి ఎస్సై రమేష్ పర్యవేక్షించారు.

రైతులకు సరిపడినన్ని ఎరువులు అందించాలి

మంథని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గంలోని రైతులకు సరిపడినన్ని ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అధ్వర్యంలో స్థానిక సింగిల్‌విండో ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ యంత్రాంగం చెప్పుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందడంలేదన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయలని డిమాండ్ చేశారు.

షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇంచార్జీ ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ ఎవరైనా మహిళల పట్ల, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా షీటీమ్ దృష్టికి తీసుకురావాలన్నారు.

కార్మిక నేత బాసాని రాజయ్య విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

మంథని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గంలో కార్మిక హక్కుల సాధన కోసం కృషి చేసిన హమాలీ సంఘం మంథని డివిజన్ వ్యవస్థాపక మాజీ అధ్యక్షుడు స్వర్గీయ బాసాని రాజయ్య విగ్రహ ఏర్పాటుకు మంథని హమాలీ సంఘం అధ్వర్యంలో బుధవారం భూమి పూజ చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో హమలి సంఘం కార్యాలయం ఎదుట విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు బాసాని రాజయ్య హమలి కార్మికుల కోసం చేసిన సేవలను కొనియడారు. ఈకార్యక్రమంలో హమలి సంఘం అధ్యక్షుడు గట్టయ్య, ప్రధానకార్యదర్శి మల్లేష్, బుక్క పుల్లయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసి ఛైర్మన్‌కుడుదుల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అయిలి ప్రసాద్, మాజీ సర్పంచ్‌ఓడ్నాల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, కొండేల మారుతి ఉన్నారు.

ఆర్జీ-2 ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



జంగిలి లక్ష్మయ్య, తోకల మైసయ్య, గాలిపల్లి రవీందర్, అజయ్



సతీష్‌కుమార్ , గాదె సురేష్

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల నుండి ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి సన్మానిస్తుంది. దీనిలో భాగంగా ఆర్జీ-2 ఏరియాలో ఐదుగురిని ఎంపిక చేసింది. తోకల మెసయ్య(ఆపీ ఆపరేటర్, ఓసీపీ-3), గాలిపల్లి రవీందర్(టర్నర్, మిషినిస్టు, ఓసీపీ-3), మారం అజయ్(ఎలక్రిషియన్, వీకేపీ గని), కుట్ల సతీష్ కుమార్(షటిల్ ఆపరేటర్, వీకేపీ గని), గాదె సురేష్ (ఎలక్రిషియన్, సీహెచ్‌పీ)లను యాజమాన్యం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసింది. వీరిని స్వాతంత్ర్య వేడుకల్లో ఆర్జీ-2 యాజమాన్యం సన్మానించనున్నది. కొత్తగూడెంలో జరిగే ప్రధాన ఉత్సవంలో జంగిలి లక్ష్మయ్య(ఈపీ ఆపరేటర్, ఓసీపీ-3)ని యాజమాన్యం సన్మానించనున్నది.

2వ రోజు నల్ల బ్యాడ్జీలతో అధికారుల నిరసన

గోదావరిఖని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అధికారుల సమస్యలు పరిష్కారం చేయాలని ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులు నిరసన వ్యక్తం చేసారు. బుధవారం రెండవ రోజు నుంచి బీసీఈ తీసుకునే కార్యాచరణను పీఆర్‌సీ సాధించే వరకు ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు, ఒక్కో ఏరియాలో నిరసన తెలియజేయాలని తీర్మానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, సీఎంఓఏఐ బీఈసీ, పొనుగోటి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్, మల్లేశం, ఏరియా ప్రెసిడెంట్, పెరుమాల శ్రీనివాస్, డా. విష్ణు, కోలా మల్లేష్, దామోదర్, క్రాంతి కుమార్, జీఎం (క్వాలిటీ) డీ బైద్యతో పాటు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యంత్రాలను పూర్తి పనిగంటలు వినియోగించుకునేలా ఉద్యోగులు శ్రమించాల్సిన అవసరం ఉన్నట్టు ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఓసీపీ-3 కృషిభవన్, ఎస్అండ్‌డీ సెక్షన్‌లలో ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. యంత్రాలను సక్రమంగా మరమ్మతులు చేయడం ద్వారా జీవితకాలం పెరుగుతుందని, తద్వారా బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడవని అన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు

గోదావరిఖని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని, యాజమాన్యం రాజకీయ జోక్యాన్ని అరికట్టకుంటే సహించేది లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం గోదావరిఖనిలో జరిగిన యూనియన్ సెంట్రల్ ఆఫీస్ బేరర్స్ మీటింగ్ అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల సాధన కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఒక వైపు కృషి చేస్తా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెందిన సొమ్మును ఇష్టానుసారంగా వాడుకుంటూ దారాదత్తం చేస్తుందని వారు ఆరోపించారు. గత ప్రభుత్వం రాజకీయ జోక్యం వల్ల సింగరేణికి రూ.19వేల కోట్లు బకాయి పడ్డదని, చెల్లించాలని ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి బకాయిలు బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకొని దుర్వినియోగం చేసిందని ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీత రాజకీయ జోక్యం వల్ల నేడు సింగరేణికి బొగ్గు, విద్యుత్తు వాడుకొని దాదాపు రూ.34 వేల కోట్లు బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. సింగరేణికి చెందిన బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తూ సింగరేణికి తీరని నష్టం చేస్తుందని వారు విమర్శించారు. స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన సమస్యలపై యాజమాన్యం సర్క్యులర్‌లు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మిర్యాల రంగయ్య, ఎల్ ప్రకాష్, వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్, ముస్కె సమ్మయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

మాదకద్రవ్యాల దురలవాటును అంతం చేయాలి

గోదావరిఖని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నేడు దేశంలో యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదక ద్రవ్యాల దురలవాటును అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ కే వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో నిర్వహించిన మాదకద్రవ్య వ్యతిరేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంతో పోలిస్తే నేడు మాదకద్రవ్యాలు, గంజాయి విచ్చలవిడిగా వివిధ రూపాల్లో లభ్యమవుతుండటంతో యువకులు, విద్యార్థులు కూడా వీటికి బలైపోతున్నారని ఇది సమాజపరంగా అతి ఘోర పరిణామం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురలవాటును సమూలంగా అంతం చేయడానికి కంకణ బద్ధులై పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) సుభాని మాట్లాడుతూ మాదక ద్రవ్యాలనుండి యువతను ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఒక దేశభక్తియుతమైన కార్యక్రమంగా ప్రతి ఒక్కరు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొగ్గు మార్కెటింగ్ శాఖాధిపతి తాడబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రతి చేస్తున్న డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో అధికారులు, ఉద్యోగులతో కలసి బుధవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జీఎం బండి వెంకటయ్య మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగాన్ని నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా ప్రతి పౌరుడు తమవంతు బాధ్యతగా భావించాలని జీఎం వెంకటయ్య సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు మురళీకృష్ణ, ధనుంజయ, పండరీనాథ్, షరీఫ్ మహమ్మద్, వినయ్ సాగర్, ప్రతాపగిరిరాజు, వేణుగోపాల్, వంశీధర్ పాల్గొన్నారు.

సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలను ఉపాధ్యాయులు వివరించారు. హెచ్ఎం సుందర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరి : మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యానికి తీవ్ర నష్టం కల్గిస్తుందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో యాంటీ డ్రగ్స్‌డే వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిహెచ్ వెంకటరమణ, చంద్రశేఖర్, భానుప్రసాదరావు, సుదర్శనం, షబ్బీరుద్దీన్, నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



జీడీకే2, 2ఏ ఇంక్లైన్‌లో డిపార్ట్‌మెంటల్ సమావేశం

గోదావరిఖని, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 2, 2ఏ ఇంక్లైన్‌లో మొదటి, రెండవ షిఫ్టుల్లో బుధవారం ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్‌మెంటల్ నిర్వహించారు. వివిధ అంశాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, ఏజీఎం (ఐఈడీ) ఆంజనేయులు, ఏజెంట్ 1 గ్రూప్ రమేష్, ఏరియా ఇంజనీరు పీ రమేష్, డీజీఎం క్వాలిటి బ్రహ్మాజీ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, మేనేజర్ రమేష్ బాబు, ఎస్‌కే అల్లాద్దీన్, డీవైఎస్‌సీ రాజన్న, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ రంగు శ్రీను, పిట్ సెక్రటరి వెంకన్న సంక్షేమాధి గణేష్, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న సంఘాలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కార్మికులను మోసం చేస్తున్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ తెలిపారు. బుధవారం యూనియన్ ఆఫీస్‌లో జరిగిన బ్రాంచి కమిటీ సమావేశంలో మాట్లాడారు. సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిందని, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విమర్శలు చేసుకోవడం మినహా రాజకీయ జోక్యాన్ని అరికట్టే దిశగా ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో సంపత్, రాంప్రసాద్, నరసింహా, భూమయ్య, లక్ష్మీరాజం, సాంబరావు, శ్రవణ్ పాల్గొన్నారు.

వార్షిక లక్ష్యాలను సాధించాలి

రామగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సమష్టిగా సాధించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో నిర్వహించిన మల్టీడిపార్ట్మెంటల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రక్షణ సూత్రాలను పాటిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సమావేశంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు ఎంఆర్‌సి రెడ్డి, కొటరవీందర్‌రెడ్డి, అధికారులు వెంకటరమణ, శేఖర్‌బాబు, రామ్మోహన్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆర్జీ-3 నర్సరీ కార్మికుల సమ్మెబాట

రామగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ నర్సరీ కాంట్రాక్టు కార్మికులు తమ రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లింపు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం సమ్మె చేపట్టారు. ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మద్దతు ప్రకటించారు.